సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
శనివారం 15 జూన్ 2024
SATURDAY, JUNE 15, 2024

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, జూన్ 14 : బొల్లారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ కోలన్ రోజా బాల్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో అధికారులు ఎజెండా ప్రవేశపెట్టగా, 10 అంశాలకు సంబంధించి రూ.11 కోట్లు అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల విషయంలో ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆర్వో శ్రీధర్, మేనేజర్ నిర్మల, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, టీపీవో పవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీనాథ్‌ను అభినందించిన కలెక్టర్

కంది, జూన్ 14 : కంది ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించిన కాశీనాథ్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్మానించి అభినందించారు. శుక్రవారం కందిలో జరిగిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కాశీనాథ్‌ను సత్కరించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆట సామగ్రి, సీసీ రోడ్డు, షెడ్డు తదితర పనులను కాశీనాథ్ చేపట్టాడు. ఈ కార్య క్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు ప్రాధాన్యతపరంగా పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 14: ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత పరంగా త్వరితగతిన పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని స్థాయిల్లోని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. డీఆర్వో పద్మజా రాణి, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఆర్సీపురంలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, డిప్యూటీ కమిషనర్ సురేశ్

రామచంద్రాపురం, జూన్ 14 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్‌కాలనీ 8వ బ్లాక్‌లో రోడ్డుకు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రంగా మారింది. దీంతో బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేశ్ నేతృత్వంలో ఖాళీ స్థలాన్ని పూర్తిగా శుభ్రపర్చి అక్కడ బల్దియా సిబ్బంది ముగ్గులు వేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలను శుభ్రపర్చి మొక్కలు నాటించడం సంతోషకరమని అన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లేశ్, ఎర్ర మల్లి, విజయలక్ష్మి, బల్దియా సిబ్బంది మల్లి కార్జున్, సుమన్, సాగర్, శ్రీను, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు

సిర్గాపూర్, జూన్ 14 : కడ్పల్ గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోద్రేజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏఈవో భార్గవాచారి ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు సూచనలిచ్చారు. ఈ పంట రైతులకు మంచి లాభదాయకమన్నారు. ఒక్క ఎకరానికి రూ. లక్ష ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ పంట సాగుకు ఇచ్చే రాయితే వివరాలను రైతులకు వివరిం చామ ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లగారి రాఘవరెడ్డి, రైతులు ఉన్నారు.

దివ్యాంగులకు అడ్మిషన్ ఇవ్వాలి

కోహీర్, జూన్14 : ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, డివిజన్ అధ్యక్షుడు కొనింటి నర్సింహులు కోరారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని మండల వనరుల కేంద్రం ఆవరణలో ఎంఈవో బస్వరాజ్‌కు ఈ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలోని మంటేస్సరీ, నారాయణ ఉన్నత పాఠశాలలు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం లేదని ఎంఈవో దృష్టికి తెచ్చారు. 2016 దివ్యాంగుల పరిరక్షణ చట్టం, 2009 విద్యాహక్కు చట్ట ప్రకారం వారికి అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో చేర్చుకునేందుకు నిరాకరిస్తున్న ఆయా పాఠశాలల యజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డివిజన్ ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, మశ్చేందర్, వాజీద్ ఉన్నారు.

సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న అధికారులు

సిద్ధివినాయక స్వామివారిని దర్శించుకున్న మండల తహసీల్దార్ భూపాల్

న్యాల్‌కల్, జూన్ 14 : మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక స్వామి అలయాన్ని శుక్రవారం మండల రెవెన్యూ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో స్వామివారికి తహసీల్దార్ భూపాల్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కృష్ణ, ఆలయ పూజారులు మోహన్ జోషి, ప్రకాశ్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మారుతీరాథోడ్

న్యాల్‌కల్, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలలో గతేడాది చదివి పాసైన విద్యార్థుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి మారుతీ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామా ల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌సీ సిబ్బంది రవి, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో విద్య బలోపేతం

పటాన్‌చెరు : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 14 : నాణ్యమైన విద్యను అందజేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని వడ్డెర కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి బలమైన పునాది ప్రాథమిక విద్యాలయంలో లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నాణ్యమైన చదువును అందజేశామన్నారు. ఉపాధ్యాయులు చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చక్కటి విద్యను అందజేయాలన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందజేసేందుకు తాము కృషి చేస్తున్నానని తెలిపారు. గురుకుల పాఠశాలలు ప్రారంభించి తెలంగాణ సర్కార్ పిల్లల ఉజ్వల భవిత్‌కు గ్యారెంటీ ఇచ్చిందన్నారు. కార్పొరేట్ సంస్థలు సైతం తమ సీఎస్సార్ నిధులను ఇస్తుండటంతో పాఠశాల విద్య బలోపేతం అవుతున్నదన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం యాదవ్, మాధవి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మండల విద్యాధికారి రాథోడ్, మాజీ సర్పంచ్ రాములు యాదవ్, మాజీ ఉప సర్పంచ్ విష్ణు వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్, జూన్ 14 : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాసాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు.

సిర్గాపూర్ : కడ్పల్ సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్ఎం, టీచర్లు

కోహీర్ : దిగ్వాల్ ప్రాథమిక పాఠశాల్లో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఎంఈవో శంకర్

రాయికోడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్ఎం విఠల్

అక్షరాభ్యాసం చేయించిన ఎమ్మెల్యే

చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 14 : బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మండల విద్యాధికారి విశ్వనాథ్, నాయకులు పండరిరెడ్డి, తాహేర్, ముంతాజ్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కంగ్టిలో..

కంగ్టి, జూన్ 14 : విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోరాదని, ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను ఎదగాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కంగ్టి మండలంలోని తుర్కవడగామ, రాజారాంతండా తదితర పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల, స్కూల్‌డ్రెస్సులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ లలిత ఆంజనేయులు, ఎంఈవో శంకర్, ఎంపీడీవో సత్తయ్య, మాజీ ఎంపీపీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో తైబజార్ వేలం

సిర్గాపూర్, జూన్ 14 : మండల కేంద్రమైన సిర్గాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయలో శుక్రవారం తైబజార్ వేలం పాట కార్యక్రమాన్ని మండల ఎంపీవో బ్రహ్మయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. స్థానికంగా ప్రతి ఆదివారం సంత కొనసాగుతుంది. సంతలో అంగడి వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ నిబంధనల మేరకు తైబజార్ వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన హన్మకొండ విఠల్ రూ. 1,51,500 కు వేలం పాటను దక్కించుకున్నారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి కార్యనిర్వహణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పీరప్ప, మరో కార్యదర్శి అనిల్, గ్రామస్తులు ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

హత్నూర, జూన్ 14 : హత్నూర మండలం మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్ తైబజార్‌కు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. దౌలాపూర్ గ్రామానికి చెందిన చింతప్రవీణ్ అత్యధికంగా రూ.10.90 లక్షలకు పాటపాడి తైబజార్ వేలం హక్కులు దక్కించుకున్నారు. తైబజార్ వేలం హక్కులు దక్కించుకున్న వ్యక్తికి వచ్చే ఏడాది మార్చి 31 తేదీ వరకు వేలం హక్కులు ఉంటాయని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాల్‌రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

హత్నూర, జూన్ 14 : గోవుల అక్రమ రవాణా, గోవధ అడ్డుకోవాలని కోరుతూ బీజేపీ, బీజేవైఎం నాయకులు శుక్రవారం హత్నూర ఎస్సై సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్యదైవమైన గోవును బక్రీద్ సందర్భంగా అక్రమ రవాణాచేసి గోవధకు పాల్పడే అవకాశం ఉందని, అలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నాగప్రభుగౌడ్, యువమోర్చ నాయకులు శ్రీకాంత్, పాండు, ప్రశాంత్, సుధాకర్, శేఖర్, వెంకట్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

బొల్లారం, జూన్ 14 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ 2023 విద్య సంవత్సరానికి బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు భానుప్రియ, సాయి బాలాజీ, రాజశ్రీ ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థుల అకౌంట్లో జమ చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

పుల్కల్, జూన్ 14 : కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ అరుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న పలు ఫర్టీ లైజర్ దుకాణాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయ అధికారి సారిక ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

రామచంద్రాపురం, జూన్ 14 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలగోని రాములు గౌడ్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌ను వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ రాజు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పోచయ్య, ఉపాధ్యాయులు రాజకుమారి, మురళి, శ్రీనివాస్, థపుర్య, అనితరెడ్డి, జ్యోతిలక్ష్మి, సత్యశ్రీ, ప్రకాశ్, శివసాయి, లక్ష్మి ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

జహీరాబాద్ కార్యాలయంలో వ్యవసాయాధికాలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్ రావు

కోహీర్, జూన్14 : వానకాలంలో పంటలను పండించే రైతులకు వ్యవసాయాధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాధికారులతో వానకాలం పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల కొరత రాకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మండలాల వారీగా రైతులకు ఎరువులు, విత్తనాల అవసరం ఎంత, ప్రస్తుతం అందుబాటులో ఎంత ఉందని వారిని వివరాలు అడిగారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సమీక్షలో ఏడీఏ భిక్షపతి, ఆయా మండలాల వ్యవసాయాధికారులు నవీన్ కుమార్, లావణ్య, వెంకటేశ్, వినోద్ కుమార్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

కోహీర్, జూన్ 14 : బక్రీద్, వానకాలం సందర్భంగా జహీరాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్‌శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బక్రీద్ కోసం పూర్తి ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జహీరాబాద్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింహులు, తంజీమ్, యాకూబ్, బండిమోహన్, అబ్దుల్లా, మోహీయొద్దీన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తాం..

ఫెన్సింగ్ ఏరియాలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

రామచంద్రాపురం, జూన్ 14 : ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫెన్సింగ్ ఏరియాలో ఆమె జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఫెన్సింగ్ ఏరియాలో ఉన్న సమస్యలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌ను వేయాల్సిన అవసరం ఉన్నదని, అందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డిసిల్టింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ జనార్దన్, నాయకులు కృష్ణగౌడ్, జైపాల్, జాకీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజే.. అనంతలోకాలకు...

గుమ్మడిదల, జూన్14 : ఓ యువకుడి తన పుట్టిన రోజును మిత్రులతో కలిసి సంతోషంగా గడిపాడు.. పుట్టిన రోజు వేడుకల్లో మిత్రులతో కలిసి కేక్ కట్‌చేసి దావత్ చేసుకున్నారు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన గురువారం రాత్రి గుమ్మడిదల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన కాశబోయిన కృష్ణకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. రెండో కుమారుడు కాశబోయిన గణేశ్ (26) బైక్ మెకానిక్. గురువారం పుట్టిన రోజు కావడంతో మిత్రులతో కలిసి సెలబ్రేషన్ చేసుకున్నారు. వేడుకల అనంతరం రాత్రి 2.30 గంటలకు తన కారులో ఇంటికి తిరిగి వస్తుండగా గుమ్మడిదల చౌరస్తాలో కారు అదుపుత ప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్సై తెలిపారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీ డిమాండ్‌పై ఎంపీడీవో సమావేశాలు

జిన్నారం, జూన్ 14 : ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని గడ్డపోతారం గ్రామస్తుల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఎంపీడీవో అరుణ శుక్రవారం వేరు వేరు సమావేశాలు నిర్వహించారు. గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీని చేయాలని గ్రామస్తులు అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులతో వేర్వే రు సమావేశాలను నిర్వహించారు. వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. మూ డు గ్రామాల ప్రజలు చెప్పిన అభిప్రాయాలను ఉన్నతాధికారులను నివేదిస్తానని ఎంపీడీవో తెలిపారు.

SANGAREDDY TEACHING STAFF VACANCY POSITIONS
Telangana Minority Residential School Boys 1 at Kandi, ODF Road, Beside Registry Office, Pin-502 285, RLC Office at 1st Floor, Ph: 9922337002.

S. No.	Name of the TMR School/Junior College	Name of the Vacant Post Teaching	Name of the Vacant Post Non-Teaching
1.	TMRS/JC Sangareddy Girls-1	JL-ENGLISH, JL-MATHS, TGT-TELUGU	Nil
2.	TMRS Andole Boys-1	PGT Bioscience, PGT English-1, PGT Physical Science	Nil
3.	TMRS/JC Andole Girls-1	PGT-English-2, TGT-Hindi, JL-Civics, JL-English	Nil
4.	TMRS/JC Algole Girls-1	JL-Chemistry, JL-Physics,	Nil
5.	TMRS/JC Patancheru Girls-1	TGT Hindi	OS, PCE

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

రామచంద్రాపురం,జూన్14 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్సీపురం డివిజన్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫొటోగ్రాఫర్స్‌కి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐడీకార్డ్స్, నూతన ధరల పట్టికను పంపిణీ చేశారు. కార్పొరేటర్ పుష్పానగేశ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పటాన్‌చెరు అధ్యక్షుడు అనిల్‌కుమార్, కోశాధికారి వీరేశం, ఉపాధ్యక్షుడు నర్సింహా, ప్రధానకార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, సభ్యులు పవన్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, శంకర్, సునీల్, బోయిన నర్సింహా, జాకీర్, అంజీ, పెంటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

జిన్నారం, జూన్ 14 : ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ. 2 లక్షల చెక్కును శుక్రవారం తన నివాసంలో ఎమ్మెల్యే కార్యకర్త కుటుంబీకులకు అందజేశారు. జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు వెంకటేశంగౌడ్, నగేశ్‌యాదవ్, నరేందర్, రాజేశ్ ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ రక్తదాతగా చంద్రశేఖర్

చంద్రశేఖర్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేశ్ శెట్కార్

నారాయణఖేడ్, జూన్ 14 : నారాయణఖేడ్ మండలం ర్యాకల్ ప్రభుత్వ పాఠశ